క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్ పద్మకు ఉత్తమ సేవా అవార్డు



జి.కొండూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జి.కొండూరు మండల పరిధి కందులపాడు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కంచర్ల పద్మ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో డెప్యూటీ సీఎం కె. పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. పద్మకు పలువురు అభినందనలు తెలిపారు.

వంతెనల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



నూజివీడు: మండలంలోని రేగుంట నుంచి యనమదల వచ్చే మార్గంలో ఎన్ఎస్‌పీ కెనాల్‌పై రెండు వంతెనల నిర్మాణానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ రెండు వంతెనల నిర్మాణానికి పీఎంజీఎస్‌వై కింద గత ప్రభుత్వ హయాంలోనే రూ.3.05 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

యోగా సాధనతో ప్రశాంత జీవనం


ఇబ్రహీంపట్నం: యోగా సాధన ద్వారా ఒత్తిడి దూరమై ప్రశాంతమైన జీవనం అలవడుతుందని ఎన్టీటీపీఎస్ సివిల్ విభాగం ఈఈ బాబూరావు అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సి కాలనీ ఆడిటోరియం వద్ద 15 రోజులుగా నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. యోగా గురువు లంకే జనార్దన్ యోగా సాధకులకు యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం, ముద్రలు, సూక్ష్మ వ్యాయామాలపై అవగాహన కల్పించి సాధన చేయించారు. ఏడీఈ రాజేష్, ఏఈఈ సుబ్రహ్మణ్యం, యోగా సాధకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



శ్రీరాంపురం(జి.కొండూరు): రెడ్డిగూడెం మండల పరిధి ముచ్చినపల్లి శివారు శ్రీరాంపురం గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను తహసీల్దార్ సుశీలాదేవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తేమ శాతం 17లోపు ఉన్న ధాన్యానికి క్వింటాకు రూ.2,320 మద్దతు ధర ఇస్తున్నామని చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యాన్ని నిబంధనల మేరకు ఆరబెట్టుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందన



తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు సర్పంచి బొల్లెపోగు చిట్టిబాబు అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తిరువూరు డివిజన్ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన పోలిశెట్టిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థిని కొప్పుల మమతశ్రీ అభినందన కార్యక్రమం గురువారం పాఠశాలలో జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయుల బోధనతో మమతశ్రీ 583 మార్కులు సాధించిందన్నారు. ప్రధానోపాధ్యాయుడు గుమ్మా రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితుల బైండోవర్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు సారా కేసుల్లో నిందితులను ఎ.కొండూరు తహసీల్దారు ఎదుట గురువారం బైండోవర్ చేశారు. కుమ్మరికుంట్ల తండాకు చెందిన గుగులోతు సక్రు, భూక్యా పార్వతి, పడమట మాధవరం తండాకు చెందిన పాల్తియా సోతి, ఎ.కొండూరు తండాకు చెందిన బాణావత్ రాములును తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. చీమలపాడు తండాలో బెజవాడ రమాదేవి అనే పాత నేరస్తురాలు బైండోవర్ నిబంధన ఉల్లంఘించినందుకు ఎ.కొండూరు తహసీల్దారు రూ.10వేల జరిమానా విధించారని చెప్పారు.

ఉచిత సీట్లు అందని ద్రాక్షేనా?

- శాపంగా మారిన రెండు కి.మీ. దూరం నిబంధన
- ఉచిత సీట్లు పొందలేకపోతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు
- మండలాన్ని ప్రామాణికంగా తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు



ఇబ్రహీంపట్నంలో పట్టణ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్న పాఠశాల



కొండపల్లిలో ఉచిత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించి నిర్బంధ విద్యను అమలు చేసేందుకు తెచ్చిన విద్యా హక్కు చట్టం–2009 గ్రామీణ విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. ఈ చట్టంతో బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉండగా పాఠశాలకు విద్యార్థి నివాసం రెండు కిలోమీటర్ల లోపు ఉండాలనే నిబంధన గ్రామీణ విద్యార్థులకు శాపంగా మారింది. దీంతో గ్రామీణ విద్యార్థులు ప్రైవేట్ స్కూల్స్‌లో ఉచిత సీట్లు పొందలేకపోతున్నారు. పట్టణాల్లో ప్రైవేట్ స్కూల్స్ ఎక్కువగా ఉన్నందున ఆప్రాంతం వారే ఉచిత సీట్లు పొందుతున్నారు. మండలం యూనిట్‌గా లాటరీలో సీట్లు కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చట్టంలోని ప్రధాన అంశాలు ఇవి..

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 2009 జులై 2న కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తెచ్చింది. 5–14 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి. వందశాతం విద్యార్థులను కింది తరగతి నుంచి పై తరగతికి పంపించాలి. దివ్యాంగులకు అందరితో సమానంగా విద్య అందించాలి. అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పేద కుటుంబాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాలి. డ్రాపవుట్లు లేకుండా చర్యలు చేపట్టాలి. పాఠశాలల్లో అడ్మిషన్లకు డొనేషన్‌లు, ఫీజులు వసూలు చేయకూడదు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఇంటర్వ్యూ చేయకూడదు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చట్టం అమలు

విద్యా హక్కు చట్టం–2009ని అమలు చేయడంలో అనేక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు చొరవ చూపలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా హక్కు చట్టం అమలుకు చర్యలు చేపట్టారు. అనేక మంది పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు పొందారు. పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అందుకున్నారు. తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గించారు.

చట్టం అమలులో లోపాలు ..

విద్యా హక్కు చట్టం అమలులో అధికారులు నిర్దిష్టమైన విధానాలు అమలు చేయలేదు. విద్యార్థులు ఉచిత సీట్లు పొందేందుకు విద్యార్థి నివాసం ప్రైవేట్ పాఠశాలకు రెండు కిలోమీటర్ల లోపు దూరం ఉండాలనే నిబంధన గ్రామీణ విద్యార్థులకు శాపంగా మారింది. గతంలో లాటరీలో సీట్లు పొందిన విద్యార్థులు నివాసం దూరాన్ని బట్టి సీట్లు కోల్పోయారు. ప్రైవేట్ పాఠశాలలు ఎక్కువగా పట్టణాల్లో ఉన్నందున పట్టణ విద్యార్థులు మాత్రమే సీట్లు పొందుతున్నారు. మండలంలో 19 ప్రైవేట్ పాఠశాలల్లో 25 చొప్పున 475 మంది ఉచిత సీట్లు పొందాల్సి ఉంది. రెండు కిలోమీటర్ల నిబంధనతో 43 మంది మాత్రమే గత ఏడాది సీట్లు పొందారు. నివాసం కాకుండా మండలాన్ని ప్రామాణికంగా తీసుకుని సీట్లు కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండలం ప్రామాణికంగా సీట్లు కేటాయించాలి



విద్యా హక్కు చట్టం ద్వారా పేదలకు ఇవ్వాల్సిన 25 శాతం సీట్లు అర్హులకు దక్కడం లేదు. పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరం నిబంధనతో అర్హత ఉండి కూడా గ్రామీణ ప్రాంత విద్యార్థులు అనర్హులుగా మిగులుతున్నారు. నివాసం కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని లాటరీలో సీట్లు కేటాయించాలి.

– ఎ.సునీల్‌దేవ్, పేరెంట్, జూపూడి

రెండు కిలో మీటర్ల నిబంధన తీసివేయాలి



గత ఏడాది నా కుమార్తెకు స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో లాట రీ ద్వారా ఒకటో తరగతిలో ఉచిత సీటు వచ్చింది. అది బాలుర పాఠశాల కావడంతో నా కుమార్తెకు సీటు ఇవ్వలేదు. రెండు కిలో మీటర్ల నిబంధనతో ఇబ్రహీంపట్నం ప్రైవేట్ పాఠశాలల్లో సీటు పొందలేక పోయాం. రెండు కిలో మీటర్ల నిబంధన ఎత్తివేయాలి.

– డి.తనూజ, పేరెంట్, చిలుకూరు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా



మైలవరం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు మైలవరం పంచాయతీ కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు వెంటనే పునఃప్రారంభిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కార్మికుల దినోత్సవం మే డే రోజు సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మైలవరం భవన నిర్మాణ కార్మిక యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం వసూలు చేసిన సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్ ధరియాకు వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీనివాసరావు, డి. వెంకటేశ్వరరావు, ఎం. దుర్గారావు, బి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నూజివీడు: డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు నూజివీడులోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చరిత్ర అధ్యాపకుడు రెబ్బ మురళీకృష్ణ తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. గతంలో గ్రూపు–2, గ్రూపు–4 పరీక్షలకు సైతం శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఈ అవకాశాన్ని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీరాజ్‌తోనే పల్లెల అభివృద్ధి



ముసునూరులో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

ముసునూరు: పంచాయతీ రాజ్ విభాగంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ ఛాయాకుమారి, సహాయకులు సగ్గుర్తి శ్రీనివాస్, శామ్యూల్ మోరిస్, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

- తిరువూరు: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని తిరువూరు మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చౌటపల్లిలో సర్పంచి యరమల రాజేశ్వరి ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. పంచాయతీ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆంజనేయపురం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి మామిడి కుటుంబరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో గ్రామ సమస్యలపై చర్చించి తీర్మానించారు. ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఎర్రమాడు పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచి బొర్రా మాధవి ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. పంచాయతీ రాజ్ శాఖ సేవలను కొనియాడారు.
- విస్సన్నపేట: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విస్సన్నపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో గ్రామ సమస్యలపై చర్చించి తీర్మానించారు. ఉప సర్పంచి ఎం. సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యుడు ఎస్. కుటుంబరావు, పంచాయతీ కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

ఎస్ఐ చిరంజీవి

ముసునూరు: పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఎస్ఐ ఎం.చిరంజీవి సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నారులను చెరువుల్లో, బావుల్లో, కాలువల్లో ఈతకు పంపరాదని హెచ్చరించారు. గతంలో తమ్మిలేరు పరీవాహక గ్రామాలకు చెందిన చిన్నారులు, యువకులు పలువురు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డారని, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. పిల్లలకు మోటార్ బైక్‌లను ఇచ్చి రహదారి ప్రమాదాలకు కారకులు కావద్దని సూచించారు. మైనర్ల డ్రైవింగ్‌ను, ట్రిపుల్ రైడింగ్‌ను సహించబోమని, కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

మజ్జిగ పంపిణీ

తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామ ప్రముఖుడు పద్మనాభుని సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మనాభుని సర్వేశ్వరరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ లక్ష్మణరావు, సభ్యులు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవాలు

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో సత్య సాయిబాబా ఆరాధనోత్సవం గురువారం నిర్వహించారు. గ్రామంలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజల అనంతరం బాబా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. సత్య సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జి. నరసింహారావు, కార్యదర్శి హనుమంతరావు, వెదురు వెంకటరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నేతల వినతి



తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు

తిరువూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికుల హక్కులు కాపాడాలని కోరుతూ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు ఎ.కొండూరు తహసీల్దారు కార్యాలయంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. భవన కార్మికులకు ప్రమాదబీమా సదుపాయం కొనసాగించాలని, కుటుంబ సభ్యులకు చదువు, పెళ్లి తదితర అవసరాలకు ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోమటి రామారావు, సీఐటీయూ మండల అధ్యక్షుడు జెట్టి వెంకటేశ్వర్లు, కార్మిక సంఘ నాయకులు నాగరాజు, వెంకటేష్, రాములు, మారయ్య పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

తిరువూరు: ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ నేతలు ఏడాది గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని సీఐటీయూ తిరువూరు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సీఐటీయూ పిలుపు మేరకు తిరువూరు తహసీల్దారు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. సంక్షేమ బోర్డు ప్రారంభించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డెప్యూటీ తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం సమర్పించారు.

ఉగ్ర దాడులకు నిరసనగా క్యాండిల్ ర్యాలీలు



నూజివీడులో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

నూజివీడు: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల అమానుష దాడులను తీవ్రంగా ఖండిస్తూ నూజివీడు బీజేపీ పట్టణ అధ్యక్షురాలు నాగరాణి ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక త్రివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. త్రివిధ విద్యాసంస్థల అధినేత సబ్బినేని శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

- విస్సన్నపేట: కశ్మీర్‌లో ఉగ్రదాడులను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో విస్సన్నపేటలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. కశ్మీర్‌లో హింసాయుత కార్యకలాపాలను, ఉగ్రవాద చర్యలను నిరోధించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి త్యాగరాజు, నాయకులు పాల్గొన్నారు.
- తిరువూరు: తిరువూరులో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి చీరాల సెంటర్ వరకు జరిగిన ప్రదర్శనలో నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా, మాలపాటి ఉదయ్, సుబానీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: బీజేపీ మైలవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వరరావు, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని న్యాయవాదులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు చలసాని వెంకటరామారావు, కొమ్మన నాగేశ్వరరావు, చాట్ల పుల్లారావు పాల్గొన్నారు. చాట్రాయి సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

బూడిద లారీలను అడ్డుకున్న స్థానికులు

జాతీయ రహదారిపై ధర్నా



హైవేపై ఆందోళన చేస్తున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు నుంచి లోడింగ్‌తో వస్తున్న బూడిద లారీలను పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రజలు గురువారం అడ్డుకున్నారు. బూడిద లోడు లారీలను 65వ నంబర్ జాతీయ రహదారిపై పార్కింగ్ చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కింగ్ చేయడం వలన నీటితో కలిసిన బూడిద రోడ్డుపై పడి గాలికి లేచి ఇళ్లల్లోకి వస్తోందని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. రోడ్డు పక్కన బూడిద లారీలు నిలపరాదని నినాదాలు చేశారు. ఎన్టీటీపీఎస్ కాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని, లారీల బూడిద కాలుష్యం తట్టుకోలేక రోడ్డెక్కాల్సి వచ్చిందని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎన్టీటీపీఎస్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. వారిని కూడా ప్రజలు ముట్టడించడంతో చేసేదిలేక వెనుతిరిగారు. స్థానికుల ధర్నాతో సుమారు కిలో మీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు స్థానికులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చెర్వుమాధవరంలో కార్డన్ సెర్చ్



తిరువూరు తంగిళ్లబీడులో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ గిరిబాబు

జి.కొండూరు: మండల పరిధి చెర్వుమాధవరం గ్రామంలో పోలీసులు గురువారం ఉదయం కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాద్‌రావు, సీఐ డి.చంద్రశేఖర్ పర్యవేక్షించగా జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం ఎస్ఐలు కె.సతీష్ కుమార్, కె. సుధాకర్, బి.మోహన్‌రావు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఉదయం ఆరు నుంచి రెండు గంటల పాటు గ్రామంలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పత్రాలను చూపిన వ్యక్తులకు వాహనాలు కొన్నింటిని తిరిగి అప్పగించారు. అనుమానిత వ్యక్తులు, క్రైమ్ రికార్డు ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిషేధిత మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా చట్టపరంగా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

- తిరువూరు: స్థానిక తంగిళ్లబీడు కాలనీలో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచి తిరువూరు సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో సర్కిల్లోని పోలీసులు కాలనీలో ఇంటింటికీ వెళ్లి అనుమానితులను ప్రశ్నించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేవారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు ఆపాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నూజివీడు: మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు తక్షణమే ఆపాలని, పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఏఐసీసీటీయూల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యా లయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్లందరికీ రూ.41 వేల వేతనం ఇవ్వాలని, జీఓ నంబరు 117కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో చేస్తున్న పలు సర్దుబాట్లలో పాఠశాలలను వేరే పాఠశాలల్లో విలీనం చేస్తున్నారని, దీనిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 20న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని ఈ సమ్మెలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలన్నీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దుర్గం పుల్లారావు, వేమూరి బక్కయ్య, పరకల కళావతి, భవాని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న పొలాలు దగ్ధమైన రైతులకు ఎకరాకు రూ.75 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కొటికలపూడి గ్రామంలో కాలిపోయిన మొక్కజొన్న పొలాలను సీపీఎం, సీఐటీయూ నాయకులు గురువారం పరిశీలించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ శాఖాధికారులు తమ తప్పిదాలు కప్పిపుచ్చుకోవడానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఐటీయూ నాయకులు విఠల్‌రావు, మహేష్, రైతులు పాల్గొన్నారు.

నేడు తిరుమంజన సేవ

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మించిన దాసాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం తిరుమంజన సేవ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు తెలిపారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులైన సందర్భంగా మూల విరాట్‌లకు తిరుమంజనం, అనంతరం ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు.

మలేరియాపై అవగాహన

నూజివీడు: మలేరియాపై అవగాహన కార్యక్రమం బంగినపల్లి తోటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం. యలమంద మాట్లాడుతూ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలు దోమల బారిన పడకుండా దోమ తెరలను ఉపయోగించాలని సూచించారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): రైతుల వద్ద ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మూలపాడులో రైతుల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను గురువారం వారు పరిశీలించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందారావు పలువురు రైతులు పాల్గొన్నారు.